సాక్షి e-paper

23-Aug-15

# 'డిజిటల్ ఇండియా' దిశగా అడుగులు






**ట్రిపుల్ ఐటీ విద్యార్థి జయదేవ్‌కు గోల్డ్‌మెడల్ అందిస్తున్న డాక్టర్ వీకే సారస్వత్, పట్టాలందుకున్న విద్యార్థినుల ఆనందహేల..**

**నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్**

రాయదుర్గం: డిజిటల్ ఇండియా సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్ సారస్వత్ పేర్కొన్నారు. ఇందుకోసం దేశంలోని 2.50 లక్షల గ్రామాలకు రూ.1.13 లక్షల కోట్ల ఖర్చుతో బ్రాడ్ బ్యాండ్ సేవలను అందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందన్నారు. ట్రిపుల్ ఐటీ-హైదరాబాద్ 14వ స్నాతకోత్సవాన్ని గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.కె.సారస్వత్ మాట్లాడుతూ 2019 నాటికి 2.50 లక్షల గ్రామాల్లో 4 లక్షల పబ్లిక్ ఇంటర్‌నెట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు ప్రతి పౌరునికి వైఫై సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా ఐటీ రంగంలో 1.7 కోట్ల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పరోక్షంగా మరో 8.50 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని అంచనావే శారన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో అందరికీ మొబైల్ కనెక్టివిటీ సౌకర్యం కల్పించడం, ఈ-గవర్నెన్స్, ఈ-క్రాంతి, అందరికీ సమాచారం వంటివి గ్రామాల్లో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

## 2020 నాటికి స్టీరింగ్‌లేని కార్లు: ట్రిపుల్ ఐటీ చైర్మన్ రాజిరెడ్డి

టెక్నాలజీ రంగం అతివేగంగా పురోభివృద్ధి సాధిస్తోందని ట్రిపుల్‌ఐటీ చైర్మన్ ప్రొఫెసర్ రాజిరెడ్డి పేర్కొన్నారు. స్కైప్ ద్వారా విద్యార్థులతో ఆయన వీడియో చిత్రం ద్వారా ప్రసంగించారు. 2020 నాటికి స్టీరింగ్‌లేని కార్లు కూడా అందుబాటులోకి రానున్నాయని, 50 శాతం కార్లు అవే ఉన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రమాద రహిత విమానాల ప్రయాణాలను కూడా మనం చూస్తామన్నారు.

## 70 స్టార్టప్‌ల ద్వారా ఏటా రూ.6 కోట్ల రెవెన్యూ: పీజే నారాయణన్

ట్రిపుల్‌ఐటీలో ఇన్నోవేషన్ అండ్ ఇంకుబేషన్ యాక్టివిటీస్ ద్వారా 70 స్టార్టప్‌లను నిర్వహిస్తూ వాటి ద్వారా ఏటా రూ.6 కోట్ల రెవెన్యూ సాధించి, 400 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రతిష్టాత్మక టి-హబ్‌ను సెప్టెంబర్ 7న అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డీన్ జయంతి శివస్వామి, పలువురు డీన్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు...**

# ట్రిపుల్ ఐటీలో స్నాతకోత్సవ సందడి

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ 14వ స్నాతకోత్సవం సందడిగా సాగింది. గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో విద్యార్థులకు ఇంజినీరింగ్ అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ పట్టాలను ఈ సందర్భంగా శనివారం పంపిణీ చేశారు. అయితే ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు ఒక ప్రత్యేకత ఉంది. డిగ్రీ పట్టాలను పంపిణీ చేసే ముఖ్య అతిథి నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పట్టాలు పొందే విద్యార్థి వరకు అంతా ఒకే డ్రెస్ కోడ్‌ను పాటిస్తారు. కుర్తా, పైజామా, మెడలో కండువా ధరిస్తారు. కాగా పట్టాలను పొందిన తర్వాత విద్యార్థులంతా ఆడిటోరియం బయట గుంపులుగా చేరి కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడుపుతారు.

## గీత కార్మికుడి కొడుకును..



మాది నల్గొండ జిల్లా రామన్నపేట్ మండలం శోభనాద్రిపురం. మా తండ్రి హన్మంతు గీత కార్మికుడు. పీహెచ్‌డీ పట్టా పొందడం గర్వంగా ఉంది. ప్రస్తుతం నగరంలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలిటెక్నిక్ కోర్సును పూర్తి చేశా.

– డాక్టర్ నరేందర్,
పీహెచ్‌డీ పట్టా పొందిన విద్యార్థి.

## గ్రామంలో ఏకైక ఇంజనీర్‌ను..



రంగారెడ్డి జిల్లా మర్పల్లి గ్రామంలో నా తండ్రి నాగిరెడ్డి రైతు. మా గ్రామం నుంచి ఇంజినీరింగ్, పీహెచ్‌డీ పొందిన మొదటి వ్యక్తిని నేనే. ప్రస్తుతం సీబీఐటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా. రైతుబిడ్డ కుమార్తెగా పీహెచ్‌డీ పొందడం చాలా గర్వంగా ఉంది. భవిష్యత్తులో పరిశోధనలపై దృష్టి సారించాలని భావిస్తున్నాను.

–డాక్టర్ ఎ.విమల, పీహెచ్‌డీ పట్టా పొందిన విద్యార్థిని.

## ఎంబీఏ చేయాలని ఉంది...



ప్రస్తుతం బీటెక్ పూర్తి చేశా. మాది కేరళ రాష్ట్రం. మా తల్లిదండ్రులు ఇద్దరూ ప్రొఫెసర్లు. గోల్డ్ మెడల్ పొందడం ఎంతో సంతోషానిచ్చింది. ప్రస్తుతం క్వాల్‌కామ్‌లో పనిచేస్తున్నాను. రెండేళ్లపాటు జాబ్‌లో కొనసాగి, ఆ తర్వాత ఎంబీఏ చేయాలని అనుకుంటున్నా.

–మనూ విశ్వనాథన్
గోల్డ్ మెడలిస్ట్